క్లుప్తంగా

సారా రహిత గ్రామంగా మరిపల్లి



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్, ఎక్సైజ్ సీఐ

సాలూరు రూరల్: మండలంలోని మరిపల్లి గ్రామాన్ని సారా రహిత గ్రామంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవిప్రసాద్, సర్పంచ్ టి.నారాయణమ్మ ఆధ్వర్యంలో తీర్మానించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామ సాథయి సమావేశం నిర్వహించామన్నారు. సమావేశంలో మరిపల్లి గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. సమావేశంలో గ్రామ కార్యదర్శి కె.సుమలత, వీఆర్‌వో ఎం.జగన్‌మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించాలి



కల్వర్టు నిర్మించాల్సిన పులివలస గెడ్డ

సాలూరు రూరల్: మండలం తోణాం పంచాయతీ పులివలస గ్రామానికి వెళ్లే దారిలో గెడ్డపై కల్వర్టు నిర్మాణానికి ఎన్నికల ముందు మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర నిధులు మంజూరు చేసి శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. ఎన్నికల అనంతరం ఏడాది పూర్తి కావస్తున్నా ఇంతవరకు ఆ గ్రామానికి కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ఆ గ్రామ ప్రజలు వెంటనే కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మద్యం సీసాలు



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఖాళీ మద్యం సీసాలు

బలిజిపేట: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు దర్శనమివ్వడంతో పలువురు ఉద్యోగులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. కార్యాలయ ఆవరణలో రాత్రి సమయాల్లో ఎవరైనా మద్యం సేవించి పడేస్తున్నారా? అనేది ప్రశ్నార్థకమైంది. కార్యాలయానికి గేట్లు వేసి తాళాలు వేయకపోతే అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారే అవకాశం ఉందని స్థానికులు గుసగుసలాడుతున్నారు. కార్యాలయం గ్రామానికి శివారున ఉండడంతో ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు.

యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



యోగాంధ్ర విధి విధానాలను వివరిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

సీతానగరం: మండలంలోని నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమంలో అధికారులతో పాటు ప్రజలంతా భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27 నుంచి గ్రామాల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. యోగాంధ్ర కార్యక్రమాలు సచివాలయాల పరిధిలో ఈ నెల 27 నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీటీ ఎ.ఉమామహేశ్వరరావు, పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉషారాణి, ఆయుష్ వైద్యాధికారి టి.హేమాక్షి తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలి

• మండల ప్రత్యేకాధికారి మన్మధరావు

పాలకొండ రూరల్: ప్రభుత్వ పథకాల అమలు చేయడంలో ఫీల్డ్ సిబ్బంది ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మండల ప్రత్యేకాధికారి, పశుసంవర్ధకశాఖ జె.డి డాక్టర్ శివ్వాల మన్మధరావు అన్నారు. మండలంలోని అన్నవరం, అంపిలి, గోపాలపురం పరిధిలో శుక్రవారం ఆయన పర్యటించి ఎస్‌డబ్ల్యూపీ కేంద్రాల పరితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ.. రానున్న ఎపిడమిక్ సీజన్‌లో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా, ప్రజారోగ్య రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చిన్నపాటి సమస్య గుర్తించినా అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. అనంతరం ఉపాధి పనులను పరిశీలించారు. ఎంపీడీఓ ఎం.విజయరంగారావు మండల పరిధిలో చేపడుతున్న ఉపాధి పనుల వివరాలను ఆయనకు వివరించారు.

టీడీపీ హయాంలో శంకుస్థాపన.. వైఎస్సార్‌సీపీ హయాంలో నిర్మాణం

• నారాయణపురం వంతెన నిర్మాణం జగనన్న హయాంలోనే పూర్తి
• ఏడాదికి పైగా వంతెనపై రాకపోకలు



వైఎస్సార్‌సీపీ హయాంలో పూర్తయిన నారాయణపురం వంతెన

బలిజిపేట: తెలుగుదేశం హయాంలో శంకుస్థాపనకే పరిమితమైన నారాయణపురం వంతెన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మాణం పూర్తి చేసుకుంది. దీనిపై ఏడాదికి పైగా రాకపోకలు సాగుతుంటే టీడీపీ హయాంలో పూర్తయిందని పచ్చ పత్రిక తన రోత రాతలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుండడంతో ప్రజలు నవ్విపోతున్నారు. అంతెందుకు పచ్చ పత్రిక రాతలపై టీడీపీ నాయకులే పెదవి విరుస్తున్నారు. ఇవేమి రాతలంటూ విస్తుపోతున్నారు. మరీ ఇంతలా డప్పు కొట్టుకోవడం ఏమిటని, ప్రజల ఎలా కనబడుతున్నారని వారు గుసగుసలాడుకుంటున్నారు. వాస్తవానికి ఈ వంతెన నిర్మాణం పూర్తయి ఏడాదికి పైగా రాకపోకలు సాగుతుంటే మళ్లీ ప్రారంభానికి ఏర్పాట్లు చేయడం కక్కిన కూడు తిన్నట్టేనని విమర్శలు వినిపిస్తున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల మంజూరు

2010లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బలిజిపేట మండలంలోని నారాయణపురం లేదా అరసాడ వద్ద వంతెన నిర్మాణం జరపాలనే దానిపై అప్పట్లో మల్లగుల్లాలు పడ్డారు. చివరకు నారాయణపురం వద్ద వంతెన నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. 2010లో నిధులు మంజూరు చేసింది. అప్పటి నుంచి ఏదో ఒక కారణంతో ఆ నిధులు మూలుగుతూ వచ్చాయి. ఏడేళ్ల తరువాత మోక్షం కలిగి 2018లో నారాయణపురం వద్ద వంతెన నిర్మాణం చేసేందుకు ఆ ఏడాది ఫిబ్రవరి 12న అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు శంకుస్థాపన చేసి టెంకాయలు కొట్టి రూ.10.5కోట్లతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అయితే ఆనాటి టీడీపీ పాలనలో బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ఏడు పిల్లర్లలో నాలుగు, ఒక ఎబట్‌మెంట్ మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. 2019లో టీడీపీ ప్రభుత్వం మారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ సమయానికి వంతెన నిర్మాణ పనులు ప్రారంభ దశలోనే ఉండడంతో అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషితో పనులు ఊపందుకొని చకచకా జరిగాయి.



నిర్మాణం పూర్తయిన తరువాత బ్రిడ్జి పనులు పరిశీలించిన అప్పటి ఎమ్మెల్యే జోగారావు(ఫైల్)

ఏడాదికి పైగా రాకపోకలు

నారాయణపురం వద్ద సువర్ణముఖీ నదిపై వంతెన నిర్మాణం పూర్తయి ఏడాదికి పైగా రాకపోకలు సాగుతున్నాయి. ఆర్టీసీ అధికారులు పార్వతీపురం నుంచి నారాయణపురం మీదుగా బలిజిపేటకు బస్సు నడపడమే తరువాయి తప్ప మిగిలిన అన్ని రకాల వాహనాలు తిరుగుతున్నాయి. పార్వతీపురం నుంచి బలిజిపేట వచ్చే జిల్లా అధికారులు, ఇతరత్రా కార్యాలయం అధికారులు, సిబ్బంది నారాయణపురం వంతెన మీద నుంచే వస్తున్నారు. ఏడాది కాలంగా రాకపోకలు జరుగుతుంటే ఇప్పుడు ప్రారంభించడం ఏంటి? అంటూ స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే నిర్మాణ పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అప్పటి ఎమ్మెల్యే అలజంగి జోగారావు నారాయణపురం వంతెన నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. కోవిడ్ సమయంలో పనులకు ఎవరూ రాకున్నా.. అధికారులతో సంప్రదిపులు జరిపి వారికి అన్ని విధాల సహకరించి మిగిలిన పిల్లర్లను పూర్తి చేయించారు. 2020 డిసెంబర్ 9న అప్పటి ఎమ్మెల్యే జోగారావు పనులను పరిశీలించారు. పనులు పూర్తయిన తరువాత 2023 అక్టోబరు 17న శ్లాబ్ నిర్మాణ పనులు ఏ విధంగా జరిపారనేది పరిశీలించారు. 2023 నవంబరు 6న అప్రోచ్‌మెంట్ రోడ్డు బీటీ పనులు పరిశీలించారు. ఎప్పటికప్పుడు వంతెన నిర్మాణ పనులు పరిశీలించి పూర్తయ్యేందుకు తన వంతు కృషి చేశారు. వంతెన నిర్మాణానికి మిగిలిపోయిన 3పిల్లర్లు, 1 ఎబట్‌మెంట్, పిల్లర్లపై 139 మీటర్ల శ్లాబును, నారాయణపురం వైపు, గౌరీపురం వైపు కలిపి 1100మీటర్ల ఎప్రోచ్‌మెంట్ రోడ్డు, బీటీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఈ పనులన్నీ 2023 సంవత్సరంలో పూర్తయ్యాయి.

ప్రజలకు అన్నీ తెలుసు..



2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపురం వద్ద వంతెన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. టీడీపీ హయాంలో టెంకాయలు కొట్టి చేతులు దులిపేసుకున్నారు. పనులపై దృష్టి సారించలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు దానిపై పర్యవేక్షణ లేదు. అతీగతి లేదు. నేను ఎమ్మెల్యే ఎన్నికైన తరువాత ప్రత్యేక దృష్టి సారించి అన్ని పనులు పూర్తి చేయించాను. టీడీపీ హయాంలో పూర్తయినట్టు ప్రచారం చేసుకోవడం వారి విజ్ఞతకే వదిలేశాం. ప్రజలకు అన్నీ తెలుసు.

– అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే

సొంపుగాం వంతెన పూర్తయ్యేదెప్పుడో...



సాలూరు మండలంలోని కురుకుట్టు పంచాయతీ సొంపుగాం గ్రామానికి 2021లో మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర రూ.2.80 కోట్లతో వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. అయితే పనులు మధ్యలో నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ గ్రామానికి వర్షాకాలంలో చేరుకోవాలంటే అవస్థలు తప్పడం లేదని గిరిజనులు వాపోతున్నారు. వెంటనే వంతెన నిర్మాణ పనులు పునఃప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– సాలూరు రూరల్

ప్రజలకు మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రాజేశ్వరి

సీతానగరం: మండలంలోని సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి, మండల ప్రత్యేకాధికారి ఐ.రాజేశ్వరి అన్నారు. మండలంలోని చినబోగిలి, పెద బోగిలి – 1, 2 సచివాలయాల్లో ఉద్యోగులు నిర్వహిస్తున్న విధులు, ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ సచివాలయాల్లో శాఖల వారీగా ఉద్యోగులు ప్రజలకు అవసరమైన సేవలందించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలతో పాటు రేషన్ కార్డులు చేర్పులు, మార్పులు చేస్తున్న విధానంపై అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఎంఎల్ఎన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించాలి

పార్వతీపురం: విద్యాహక్కు చట్టం ప్రకారం పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం ఉచిత అడ్మిషన్లను అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి. రవికుమార్ అధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి పేద విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలను కల్పించాలని హైకోర్టు ఆదేశించడం ఎంతో శుభపరిణామమన్నారు. కానీ ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ప్రవేశాలు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఉచిత ప్రవేశాలను అర్హులైన పేదలకు అందేలా నిర్దిష్టమైన నిబంధనలను విధించేలా చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాలలకు చెల్లించాల్సిన ఫీజు బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

రెగ్యులర్ డీఈవోను నియమించాలి

జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి రెగ్యులర్ డీఈవోను నియమించాలని విద్యార్థి సంఘం మాజీ నాయకులు, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వరుసగా మూడుసార్లు పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన పార్వతీపురం మన్యం జిల్లాకు రెగ్యులర్ డీఈవోను నియమించలేరా అని ప్రశ్నించారు. సీనియర్లు ఉండగా ఒక జూనియర్‌ను ఇంచార్జ్ డీఈవోగా ఎలా నియమిస్తారన్నారు. తక్షణం పూర్తి స్థాయి డీఈవోను నియమించాలని, లేదంటే పోరాటం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు.

ఎండీయూ వ్యవస్థను రద్దు చేయడం సరికాదు

పార్వతీపురం రూరల్: ప్రజా పంపిణీ వ్యవస్థలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎండీయూ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేయడం సరికాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ విమర్శించారు. మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ తీరుతెన్నులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండీయూ వాహనం ద్వారా కొన్ని చోట్ల రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతుందనే నెపంతో మొత్తం వ్యవస్థనే రద్దు చేయడం సరైన విధానం కాదన్నారు. ఎండీయూ వ్యవస్థను కొనసాగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, వ్యవస్థలో ఉన్న లోపాలను సరి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సాలూరులో..

సాలూరు: ప్రజలకు నేరుగా ఇళ్ల వద్దకు వెళ్లి రేషన్ సరుకులను అందించే ఎండీయూ వాహనాల సేవలను నిలిపివేయడం సమంజసం కాదని, వెంటనే వాహనాలను పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వైనాయుడు తెలిపారు. ఈ మేరకు ఎండీయూ ఆపరేటర్ల యూనియన్ నాయకులు శుక్రవారం సాలూరులో తమ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ భానుప్రసాద్‌కు అందించారు. కార్యక్రమంలో ఎండీయూ ఆపరేటర్స్ సంఘం సభ్యులు సంతోష్, కేశవ, రాజేష్, రాంబాబు, లక్ష్మణ, మురళి, సాయి, రవి తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం మీదుగా బస్సు నడపాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మన్మధరావు

బలిజిపేట: పార్వతీపురం నుంచి గౌరీపురం, నారాయణపురం మీదుగా బలిజిపేట బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజా సంఘాల నాయకుడు మన్మధరావు డిమాండ్ చేశారు. బలిజిపేట ప్రజా సంఘాల కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి.సత్యనారాయణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ నారాయణపురం వద్ద సువర్ణముఖీ నదిపై వంతెన నిర్మాణం పూర్తయి వాహనాల రాకపోకలు జరుగుతున్నందున పార్వతీపురం నుంచి బలిజిపేటకు బస్సు సౌకర్యం కల్పించాలన్నారు.

జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తే బొబ్బిలి మీదుగా 50కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందని, వ్యయప్రయాసలకు గురికావలసి వస్తున్నందున ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. జి.సత్యనారాయణ, బి.భానుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు నోచుకోని మున్సిపల్ బడ్జెట్

పార్వతీపురం: ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వని విధంగా పార్వతీపురం మున్సిపల్ బడ్జెట్ కేటాయింపులు చేశారని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న ధ్వజమెత్తారు. శుక్రవారం మున్సిపల్ బ బడ్జెట్ సమావేశంలో కేటాయింపులు నిర్వహించిన అనంతరం ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదికి పట్టణ ప్రజల నుంచి పన్నుల రూపంలో రూ.12కోట్లు వసూళ్లు చేస్తున్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లతో కలిపి రూ.41కోట్లు బడ్జెట్‌గా ప్రతిపాదించారన్నారు. ఈ నిధులతో పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలైన మంచినీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ పునఃనిర్మాణం, ట్రాఫిక్ నియంత్రణ నిమిత్తం కొత్త బైపాస్ రోడ్డు నిర్మాణం, విద్యుత్ వ్యవస్థ మెరుగుకు వంటి కేటాయింపులు లేకపోవడం అన్యాయమన్నారు. మూతపడిన సులభ్ కాంప్లెక్స్ నిర్వాహణకు రూ.12లక్షలు వెచ్చిస్తున్నట్టు బడ్జెట్‌లో పేర్కొన్నప్పటికీ వాటిలో పని చేస్తున్న కార్మికులకు నేటికి 16 నెలలుగా జీతాలు కూడా చెల్లించలేదన్నారు.

ఖరీఫ్ పట్ల రైతులకు అవగాహన కల్పించాలి



వ్యవసాయ కార్యాలయ సూపరింటెండెంట్‌కు రైతుల సమస్యలను చెబుతున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం:

రానున్న ఖరీఫ్‌కు రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ నాయకులు వి.దాలినాయుడు, టి. గౌరీశంకరరావు, జి. రామకృష్ణ అధికారులను కోరారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ కార్యాలయ సూపరింటెండెంట్ వి.రాంప్రసాద్‌ను కలిసి రైతుల సమస్యలను వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను సకాలంలో అందజేయాలన్నారు. ఎరువులు, పురుగుల మందుల వినియోగంపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. కేలీలు లేని వరి విత్తనాలను సరఫరా చేయాలన్నారు. రైతులు ప్రైవేటు వ్యాపారులను, దళారులను ఆశ్రయించకుండా ముందస్తుగా విత్తనాలు, ఎరువులను సరఫరాచేయాలన్నారు. ఇప్పటికే యూరియా బహిరంగ మార్కెట్‌లో 50కిలోల బస్తాకు రూ.50లు అదనంగా విక్రయాలు జరుగుతున్నాయన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగసనాలు వేస్తున్న సిబ్బంది, ప్రజలు



శీర్షాసనం వేసిన జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం రూరల్: ప్రస్తుత జీవన విధానంలో యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. శుక్రవారం యోగాంధ్రా మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో యోగా సెషన్‌ను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించి వైద్యాధికారులు, వైద్యసిబ్బంది, గ్రామస్తులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వలన శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. రోగ నిరోధక వ్యవస్థ బలపడి పలు రోగాలకు గురికాకుండా చేస్తుందన్నారు. వయస్సుకు, సౌష్టవానికి తగ్గట్టుగా చేయాల్సిన ఆసనాలు యోగా శిక్షకుల వద్ద అభ్యాసనం చేయాలన్నారు. శనివారం నుంచి యోగాపై శిక్షణ కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా జూన్ 21 వరకు యోగాంధ్రా అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు శీర్షాసనం వేసి అందరిని అబ్బురపరిచారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎస్ఎంకె.తిరుమలప్రసాద్, సూపర్‌వైజరు బి.శ్రీరాముల నాయుడు, జయగౌడ్, నాగమ్మ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ షేక్ ఇబ్రహీంకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

మక్కువ: తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలంటూ కోరుతూ తహసీల్దార్ షేక్ ఇబ్రహీంకు ఎండీయూ ఆపరేటర్లు శుక్రవారం వినతిపత్రం అందించారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయంతో తామంతా రోడ్డున పడ్డామని ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 28 నెలల అంగన్‌వాడీ మిడ్ డే మీల్స్ బకాయిలు వెంటనే రిలీజ్ చేయాలని కోరారు. ఇన్సురెన్స్ కోసం రూ.9వేలు బ్యాంకు ఖాతాల నుంచి తీసుకున్నారని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహనాల ఎన్‌వోసీ ఇప్పించాలని కోరారు. విజయవాడలో వరద బాధితుల కోసం సుమారు 12 వేల వాహనాలను ఉపయోగించారని, వాటికి సంబంధించిన నగదు చెల్లించాలని కోరారు.

ముమ్మరంగా తనిఖీలు

సీతానగరం: మండల కేంద్రంలోని మార్కెట్‌లో ఉన్న మద్యం దుకాణాలను గురువారం రాత్రి తనిఖీలు చేసినట్టు సర్కిల్ సీఐ డి.పద్మావతి తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ ఉత్తర్వుల మేరకు ప్రభుత్వం నిర్వహించిన వేలం పాట ద్వారా దక్కించుకున్న మద్యం విక్రయదారులు రాత్రి పది గంటల వరకు మద్యం విక్రయించాలని అంతకు మించిన సమయంలో విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు ముమ్మరం చేసినట్టు తెలిపారు. ఆమె వెంట ఎక్సైజ్ ఎస్ఐ షరీఫ్, సిబ్బంది ఉన్నారు.

ఫాం పాండ్స్ పనులు పూర్తి చేయాలి

సీతంపేట: ఈ నెలాఖరులోగా ఫారంపాండ్స్ పూర్తి చేయాలని డ్వామా పీడీ రామచంద్రరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సీతంపేట, భామిని ఎస్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. లేదంటే చర్యలు తప్పవన్నారు. పనులకు సంబంధించిన అంచనాలు శనివారం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీబీ మిశ్రో, ఏపీడీ శ్రీహరి, ఏపీఓ సాగర్, తదితరులు పాల్గొన్నారు.